క్లుప్తంగా

ఘనంగా స్త్రీల ఆదివారం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: ప్రతి ఒక్కరూ బైబిల్ నందు అవగాహన కలిగి ఉండాలని డి.మణికుమారి లాజరస్ కోరారు. మొగల్తూరు–2 పేరిస్ నక్కావారి పాలెంలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా స్త్రీల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరిస్ పాస్టర్ తలారి కొండయ్య మోజెష్, మార్టిన్స్, తలారి వాణి, సీఆర్ విల్లూరి లాజర్, బొద్దుపల్లి సుబ్బారావు, కోనాల ప్రసాదరావు, దీపాటి వెంకటేష్, కొండావారిపేట, గోడావారిపేట, రాజుగారితోట, పాలకమ్మ చెరువు సంఘాలకు చెందిన స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

మొగల్తూరు: కార్తీకమాసం రానుండటంతో శైవ క్షేత్రాలన్నీ ముస్తాబవుతున్నాయి. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం ఆలయాన్ని శుద్ధి చేసి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక ప్రసాద్, కొత్తలంక బాపన్న, జి.ఫణిశాస్త్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెనుగొండ విద్యార్థుల ప్రతిభ



క్యాట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన పెనుగొండ చైతన్య విద్యార్థులు

పెనుగొండ: జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నాలెడ్జ్ అసిస్మెంట్ టెస్ట్ (క్యాట్) మొదటి దశలో పెనుగొండ చైతన్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ గణిత విభాగంలో 11 మంది, భౌతిక శాస్త్ర విభాగంలో 15 మంది, రసాయన శాస్త్రంలో 21 మంది ప్రతిభన కనబరిచి రెండో దశకు మొత్తంగా 47 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం పార్థసారిథి, జోనల్ కో–ఆర్డినేటర్ రామారావు, డీన్ గణేశ్వరి, వెంకటేష్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సోమేశ్వరావు

పెనుగొండ: దీపావళి సామగ్రి దుకాణాల నిర్వాహకులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆచంట తహసీల్దారు ఎం.సోమేశ్వరరావు అన్నారు. సోమవారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. దుకాణదారులు అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ అధికారులు, ఆర్ఐ లక్ష్మి పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా



స్టీమర్‌రోడ్‌లోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

నరసాపురం రూరల్: ఎల్ఐసీ పాలసీదారులకు బోనస్ పెంచాలని, ప్రీమియంపై విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని, కనీస బీమా మొత్తం రూ.1 లక్ష ఉంచాలని ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ కార్యదర్శి పోలిశెట్టి సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎల్ఐసీ మేనేజ్‌మెంట్, ఏజెంట్లు, పాలసీదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఎల్ఐసీ ఏజెంట్లు దేశవ్యాప్తంగా 16 రోజులుగా ధర్నా చేస్తున్నారు. సోమ వారం నరసాపురం స్టీమర్ రోడ్డులోని కార్యాలయంలోని కార్యకలాపాలను అడ్డుకొని మహా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జీవీ భాస్కరరావు, కోశాధికారి కె.మనోహర్, మారుతీరావు, రామగోపాల్, ఎస్.సత్యనారాయణ, మండెల రంగారావు, ప్రకాష్, కె.రమణరావు, సురేష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపై ప్రకృతి ప్రకోపం

వరుస విపత్తులతో తగ్గిన ఖరీఫ్ సాగు



మేడపాడులో అధిక వర్షాల వలన సాగు చేయకుండా వదిలేసిన వ్యవసాయ భూమి

యలమంచిలి: వరుస తుపానులు, భారీ వర్షాలు, వరదలు ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. దీంతో రైతులు కుదేలయ్యారు. ఖరీఫ్ పంట ప్రారంభం నుంచి భారీ వర్షాలు, తుపానులు, వరదలు రైతులను కలవరపెడుతున్నాయి. నరసాపురం డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు ఆశ నిరాశల మధ్య ప్రారంభమైంది. ఆగస్టు చివరి వారం వరకు సాగు నీరు లేదని నిరాశపడ్డ రైతన్నలకు అధిక వర్షాలు ఊరటనిచ్చాయి. దీంతో రైతులు వరి సాగు చేశారు. నరసాపురం డివిజన్‌లో గత ఏడాది ఖరీఫ్ 44,153 ఎకరాలలో సాగవ్వగా ఈ ఏడాది 3408 ఎకరాలు తగ్గి 40,745 ఎకరాల్లో మాత్రమే వరి సాగయ్యింది. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశకు చేరుకుంది. ఈ దశలో వరుస తుపాన్లు అన్నదాత ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. వర్షాల వలన పైరు పాలు పోసుకోక తప్పగింజలు వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు దోమపోటు రైతులను మరింత కలవరపాటుకు గురి చేస్తుంది. రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వాతావరణ శాఖ అధికారులు మరో తుపాను ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో పెట్టుబడి కూడా దక్కదేమోనని రైతుల్లో ఆందోళన ఎక్కువైంది.

అనుకూలించని వాతావరణం

గత నెల రోజులుగా రోజు మార్చి రోజు తప్పనిసరిగా వర్షం పడుతుంది. వెంటనే విపరీతమైన ఎండ కాస్తుంది. వాతావరణంలో లోపిస్తున్న సమతుల్యత, అకాల వర్షాలు వరి పంటపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో పంట నష్ట పోయే పరిస్థితి నెలకొంది. వరి పొట్టదశలో ఉన్నప్పుడు వర్షపు చుక్కలు గింజలో చేరి గింజ తప్పగా మారి పూర్తిగా నిరుపయోగంగా మారిపోతుంది. దీనికి తోడు తెల్లదోమ ప్రభావం అధికంగా పంటలో కనిపిస్తుంది. అతివృష్టి లేకుంటే అనావృష్టి అన్న చందంగా మారిందని అన్నదాతలు వాపోతున్నారు.

మండలాల వారీగా సాగు విస్తీర్ణం

మండలం	2023 ఖరీఫ్ (ఎకరాలలో)	2024 ఖరీఫ్ (ఎకరాలలో)
నరసాపురం	6059	3570
మొగల్తూరు	819	648
యలమంచిలి	4888	4380
పాలకొల్లు	9180	9222
పోడూరు	12995	12865
ఆచంట	10212	10060
మొత్తం	44153	40745

నష్టం మీద నష్టం



వరి పంట సాగు నష్టం మిగుల్చుతోంది. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేస్తే పంట చేతికొచ్చే సమయానికి ఏదో ఒక రూపంలో నష్టం వెంటాడుతోంది. ఈ ఏడాది వరుసగా కురుస్తున్న వర్షాలతో గింజ తాలుగా మారే అవకాశం ఉంది. అదే జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

–కుక్కల సుబ్బారావు, రైతు, మేడపాడు

ఇన్ని తుపానులు ఎప్పుడూ చూడలేదు



ఈ ఏడాది వచ్చినన్ని తుపానులు ఎన్నడూ చూడలేదు. నెలరోజులుగా ఒకటే వర్షాలు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. వర్షాల వలన పంట దెబ్బతినడమే కాకుండా దోమ పోటు వలన తెగుళ్ల బెడద ఎక్కువైంది. ఇప్పటికే పెట్టుబడి ఎక్కువయ్యింది. మరొక తుపాన్ వస్తే పంటలను ఆ దేవుడే కాపాడాలి.

–గుడాల నరసింహారావు, రైతు, గుంపర్రు

విజయవాడకు నిత్యావసరాలు



విజయవాడకు నిత్యావసర వస్తువులు పంపిస్తున్న దృశ్యం

నరసాపురం: సేవా కార్యక్రమాల్లో నరసాపురం శతవార్షిక లూథరన్ దేవాలయం ముందుంటుందని చర్చి చైర్మన్ బి.ఆనందరాజు అన్నారు. విజయవాడ సింగ్ నగర్ వరద బాధితులకు సోమవారం చర్చి తరఫున నిత్యావసర సరుకులు పంపించారు. దాదాపు 300 కుటుంబాలకు సరిపడా బియ్యం, పప్పులు, దుస్తులు చర్చి సంఘ సభ్యులు ఆర్థిక సహకారంతో సమకూర్చి వ్యాన్‌లో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆనందరాజు మాట్లాడుతూ 100 ఏళ్ల తమ పురాతన చర్చి తరఫున గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. హుదుద్ తుపాన్ సమయంలో కూడా బాధితులకు సహకారం అందించామని చెప్పారు. ఇతర బాధితులను ఆదుకోవడానికి ఇప్పుడు తమవంతుగా నిత్యావసరాలు, దుస్తులు అందిస్తున్నామని చెప్పారు. చర్చి ఫాస్టర్ రెవరెండ్ ఎంఏఎస్ మార్టిన్, ట్రెజరర్ పిట్టా సుందరబాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా తమ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో చర్చి సంఘ సభ్యులు జీవీ చంద్రసింగ్, ఎన్.శ్యామ్‌సుందర్, అన్నపూర్ణ, రొక్కం జాన్ హెన్రీ, ఎస్.అనిల్ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థులకు అవార్డులు



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: కళాశాల విద్యార్థులకు మూడు జిల్లా స్థాయి అవార్డులు రావడం అభినందనీయమని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజేతలకు మొక్కలను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ శనివారం జిల్లా యువసర్వీసులు, సెట్విల్ ఆధ్వర్యంలో తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన సంబరాల్లో తమ కళాశాల విద్యార్థులు మూడు విభాగాల్లో విజేతలుగా నిలిచారన్నారు. మొత్తం 12 కళాశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ వక్తృత్వ పోటీల్లో వి.వెంకట్ బీఏ సెకండ్ ఇయర్ ద్వితీయ బహుమతి, పెయింటింగ్‌లో బి.మహాలక్ష్మి, బీఎస్సీ మొదటి సంవత్సరం, జానపద బృందం నృత్యంలో ఆరుగురు విద్యార్థినులు జిల్లా స్థాయి తృతీయ బహుమతులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వి.విజ్యలక్ష్మి, సభ్యులు బి.ఆశాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో చాంబర్స్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: భీమవరం బీవీ రాజు డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల చదరంగం పోటీల్లో చాంబర్స్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. విజేతలు ఎ.గగన్, ఎం ప్రసన్న, ఆర్ఎల్ హర్షిత, ఈఎస్ఎస్ సాత్విక, కేవీఎస్ సూర్యప్రియ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.సుధాకర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కళాశాల చైర్మన్ కేవీ నరసింహరావు, అకడమిక్ అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి, ఎన్.సీతారామారావు, ప్రిన్సిపాల్, పీడీ, తదితరులు విజేతలను అభినందించారు.

ప్రజల రక్షణలో పోలీసు పాత్ర కీలకం



రక్తదానం చేస్తున్న టౌన్ ఎస్సై జయలక్ష్మి

నరసాపురం: ప్రజల రక్షణ విషయంలో పోలీసుల పాత్ర కీలకమని నరసాపురం ఏఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి ఏఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తారని చెప్పారు. ప్రజలకు పోలీసు స్టేషన్‌కు సంబంధించి ఏ అవసరం వచ్చినా నిర్భయంగా వచ్చి ఫిర్యాదు ఇవ్వాలని చెప్పారు. పోలీసులంటే సమాజంలో ఉన్న కొన్ని భయాలు, వదంతులూ నమ్మకూడదన్నారు. విధుల నిర్వహణలో ఎందరో పోలీసు సోదరులు అమరులవుతూ ఉంటారని చెప్పారు. సీఐ ఎం.యాదగిరి, ఎస్సైలు జయలక్ష్మి, ముత్యాలరావు సహా పలువురు కానిస్టేబుళ్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన అధికారులు, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

ఘనంగా ఏనుగు సంబరం



ఏనుగు సంబరం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: బేతాళ సంబరం, ఏనుగు సంబరం 152 వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత వేడుకగా ప్రారంభమయ్యాయి. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఏనుగు సంబరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక కళా నృత్య ప్రదర్శనలు కన్నుల పండుగగా జరిగాయి. బేతాళ స్వామిని ఏనుగు అంబారీ పై ఉంచి ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మేళతాళాలు బాణ సంచా కాల్పుల మధ్య వివిధ కళారూపాల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. బేతాళ స్వామి ఊరేగింపు అత్యంత కన్నుల పండుగ వేడుకగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా వీరవాసరం ఎస్ఐ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

సీఎల్ఎస్ యాప్‌తో మెరుగైన ఫలితాలు



యాప్ పని తీరును వివరిస్తున్న మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి

యలమంచిలి: వరి సాగులో తెగుళ్ల నివారణకు ఏ విధమైన రక్షణ చర్యలు తీసుకోవాలో రైతులకు సత్వర సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయశాఖ నూతనంగా క్రాప్‌లైఫ్ సిస్టమ్ (సీఎల్ఎస్) యాప్‌ను ప్రవేశపెట్టిందని మండల వ్యవసాయాధికారి చిండలూరి దేవి చెప్పారు. మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జిలతో సోమవారం ఆ యాప్ డౌన్లోడ్ చేయించి, ఆ యాప్‌లో ఎలా వినియోగించాలో చూపించారు. పంట మీద ఆశించిన తెగులు ఫొటో తీసి ఆ ఫొటోను యాప్ ద్వారా శాస్త్రవేత్తలకు పంపాలి. శాస్త్రవేత్తలు ఆ ఫొటోను పరిశీలించి, ఆ తెగులు నివారణకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో వివరిస్తారు. ఆ వివరాలను రైతులకు చెప్పడం ద్వారా సత్వరమే తెగులు నివారించే అవకాశం ఉంటుంది.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

పెనుగొండ: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.20 వేల కోట్ల భారాన్ని తక్షణం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆచంట ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ భరోసా ఇచ్చి నాలుగు నెలలకే చార్జీల మోత మోగించిందని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలో ఇంధన సర్దుబాటు ట్రూ అప్ చార్జీలు, సెస్సు చార్జీలు, స్మార్ట్ మీటరు నిర్ణయాన్ని, గతంలో వాడుకున్న విద్యుత్‌కు నేడు బిల్లులు వేసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తగ్గించడం మాని, 44 శాతం పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, ఎస్‌వీఎన్ శర్మ, కుసుమే జైరాజు, పి.మోహన్‌రావు, మచ్చ సుబ్బారావు పాల్గొన్నారు.

నానాజీకి ప్రముఖుల నివాళులు



పెనుగొండలో నానాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రామానాయుడు

పెనుగొండ: మాజీ ఎమ్మెల్యే కూనపరెడ్డి వీర రాఘవేంద్రరావు (చినబాబు) తనయుడు లక్ష్మయ్య నాయుడు (నానాజీ) మృతికి సోమవారం ప్రముఖులు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. నానాజీ నివాసం వద్ద చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు ఘటించారు. నివాళులర్పించిన వారిలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ, ఆచంట జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, ఆకుల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, వేండ్ర రాము, కొండవీటి శ్రీనివాసరావు, పాదల సుమన్ ఉన్నారు.

ప్రజల ఫిర్యాదులపై తక్షణం చర్యలు చేపట్టాలి



కార్యక్రమంలో ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 28 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎంతో దూరం నుంచి సమస్యలు చెప్పుకుంటున్న ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకసారి ఫిర్యాదు చేసిన వారు మళ్లీ అదే సమస్యపై కార్యాలయానికి వచ్చే పరిస్థితి రాకుండా అధికారులు చూసుకోవాలని చెప్పారు. దరఖాస్తులకు సంబంధించి సమస్యల పరిష్కారం ఎంతవరకూ వచ్చిందనే అంశాన్ని ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ



చిట్టవరంలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సేంద్రీయ వ్యవసాయంతో ప్రకృతిలో లభించే వనరులతో పంట సాగు చేస్తే భూమికి, మానవ మనుగడకు మేలు కలుగుతుందని భీమవరం డీపీఎం నూకరాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం చిట్టవరం రైతుసేవా కేంద్రంలో పకృతి వ్యవసాయం, వరిలో మేలైన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఏడీఏ ఈదా అనిల్‌కుమారి మాట్లాడుతూ వరిలో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నరసాపురం, యలమంచిలి వ్యవసాయ అధికారులు సామ్యూల్ జాన్సన్, సీహెచ్ దేవి, ఏఈవోలు, వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈవోలు, సేంద్రీయ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొత్తపాలెంలో గ్రామసభ

మొగల్తూరు: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ సోమవారం తెలిపారు. గతంలో గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఏమైనా సమస్యలున్నా లేదా భూములకు సంబంధించి సమస్యలున్నా గ్రామ సభలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. తమకు అందిన ఫిర్యాదులను విచారించి భూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌లో 4 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 4 ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీ సుబ్బారావు సోమవారం చెప్పారు. స్థల సరిహద్దులు, సర్వేలు, మల్లం కోడు ఆక్రమణ తొలగింపు, అజ్జమూరు గ్రామంలోని కాళ్ల వెళ్లే రోడ్డులో ఆక్రమణలు తొలగించి, రోడ్డు మలుపు వద్ద జరిగే ప్రమాదాలను నివారించాలని గ్రామస్తుడు నంద్యాల చల్లారావు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ

పెనుగొండ: అఖిల భారత పశుగణన సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని ఆచంట జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఆచంటలో పశుగణన సర్వే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పశుగణన వలన పాడి వృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గొడవర్తి శ్రీరాములు, కేతా మీరయ్య, తమ్మినీడి ప్రసాద్, జవ్వాది బాలాజీ, నెక్కంటి సత్తిబాబు, పశుసంవర్ధక శాఖాధికారి ఫణికుమార్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పెనుమంట్ర: ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. రూ.1.25 కోట్లతో మార్టేరు సెంటర్ నుంచి పాలకొల్లు రోడ్డులోని శ్రీ కనకదుర్గమ్మ గుడి వరకు నిర్మిస్తున్న 700 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ డీఈ వరలక్ష్మి ఏఈలు ప్రసాద్, యశ్వంత్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

నరసాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నరసాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. సోమవారం సీతారామపురం సౌత్, రాజుగారితోట గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులను భీమవరం క్వాలిటీ కంట్రోల్ డీఈ గోవిందరాజు బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ డీఈ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడేది లేదన్నారు. కాంట్రాక్టర్లు వేగంగా పనులు చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో పాటించాలన్నారు. ఈయన వెంట పంచాయతీ రాజ్ డీఈ దొమ్మేటి సత్యనారాయణ, ఇన్‌చార్జి ఏఈ వై.నాగేశ్వరరావు, క్వాలిటీ కంట్రోల్ ఏఈ విశ్వనాథ రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అపరిచిత ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

ఉండి: గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉండి ఎస్సై నసీరుల్లా తెలిపారు. సోమవారం మండలంలోని పలువురు వ్యక్తులకు వివిధ ఫేక్ యాప్స్ నుంచి కాల్స్ రావడంతో వీటిని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సీబీఐ నుంచి కాల్ చేస్తున్నాం. మీ పిల్లలను డగ్స్ కేసులో అరెస్టు చేశాం. వారిని విడుదల చెయ్యాలంటే వెంటనే మీ ఫోన్‌పే లేదా గూగుల్‌పే ఓపెన్ చేసి మేము చెప్పినట్టు చేయండి అంటూ ఫోన్ కాల్స్ రావడం, బెదిరించారని ఓ బాధితుడు తెలిపారు. దీనిపై ఎస్సై మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఫేక్ కాల్స్, మెస్సేజెస్, లింక్స్ ఎక్కువైపోయాయని ప్రజలు తప్పకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. దీనిపై మన దేశ ప్రధానమంత్రి కూడా దేశ ప్రజలను అప్రమత్తం చేస్తూ సందేశం పంపించారని తెలిపారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత కొద్ది రోజుల నుంచి మండల వ్యాప్తంగా ఆటో ప్రచారం నిర్వహించామని తెలిపారు. దయచేసి ప్రజలు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెస్సేజ్‌లు నమ్మవద్దన్నారు. ఆందోళన చెందకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కొని అది మోసపూరితమైందని గమనించాలన్నారు. ఇటువంటి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే కాల్ కట్ చేసి, 1903 సైబర్ క్రైం నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి ఫేక్ ఫోన్ కాల్స్‌ను ఆన్సర్ చేయొద్దని ఎస్సై తెలిపారు.

మలేరియా సబ్ యూనిట్ అధికారి మృతి

పాలకొల్లు అర్బన్: నరసాపురం డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం.రాజ్‌కుమార్ (56) గుండెపోటుతో సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.మహేశ్వరరావు, ఉమ్మడి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాదరావు, జిల్లా ఇన్‌చార్జ్ డీఎంవో పి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, డాక్టర్ సత్యసౌజన్య, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, తదితరులు రాజ్‌కుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.